657) లలిత

ప॥ మతంగపర్వతము మాల్యవంతము నడుమ । సతమై శ్రీవేంకటేశ్వరుడున్నవాడు ॥

చ॥ కొలిచినవారికెల్లా కోరినవరములిచ్చి । తలచినవారినెల్లా ధన్యులజేసి ।
పొలుపుమిగుల మంచిపువ్వులతోటలనీడ । విలసిల్లీనదివో శ్రీవేంకటేశ్వరుడు ॥

చ॥ శరణన్నవారికి చనవిచ్చి రక్షించి । గరిమ బూజించువారి గరుణ జూచి ।
పరిపూర్ణమగు తుంగభద్రాతటమునందు । విరివిగొన్నాడు శ్రీవేంకటేశ్వరుడు ॥

చ॥ తను నమ్మినవారికి తగినసంపదలిచ్చి । కని నుతించేవారికి గామధేనువై ।
కనకమయములైనఘనమైనమేడలలో । వినుతికెక్కెను శ్రీవేంకటేశ్వరుడు ॥